# ఆ ఒక్కటీ తప్ప...

పాతిక ముప్ఫై ఏళ్ళ క్రితం అమెరికాలో ఇంతమంది భారతీయులు వుండేవాళ్ళు కాదు. అక్కడక్కడా కనపడే వాళ్ళు కానీ, ఈరోజుల్లోలా గుంపులుగా ఏ దేశీ ప్రోగ్రామో వుంటే కానీ కనపడేవారు కాదు. అలాగే ఇండియన్స్ అంటే నిజాయితీకీ, తెలివితేటలకీ, కష్టపడి పనిచేయటానికీ ప్రతీకలనీ చెప్పుకునేవారు. అలా మనల్ని గౌరవించేవారు కూడాను. కానీ గత ఏడెనిమిది ఏళ్ళుగా ఎందుకోగానీ మార్పు కనిపిస్తున్నది. రకరకాల కథలు వింటున్నాం. చూస్తున్నాం.

ఆమధ్య ఒకావిడ భర్తనీ ఇద్దరు పిల్లల్నీ చంపేసింది. తను ఆత్మహత్య చేసుకోబోయి, చేసుకోలేక పోలీసులకి దొరికిపోయింది. మరణ శిక్ష విధించటంతో, జైల్లో ఆ మరణ ముహూర్తం కోసం ఎదురు చూస్తున్నది. ఇది తెలిసి బాధపడని భారతీయులెవ్వరూ నాకు కనపడలేదు. అలాగే ఇంకొకావిడ తన పసికందుకి సరిగ్గా పెరగని అంగం దృష్ట్యా, మగో ఆడో తెలియని పరిస్థితిలో వుండగా, భరించలేక ఆ పసికందు జీవితాన్ని అంతం చేసి ప్రస్తుతం జైల్లో వుంది. ఇదీ కూడా అందరినీ ఎంతో కదిలించిన వార్త.

ఇవి కుటుంబ కారణాలవల్లా మానసిక కారణాలవల్లా జరిగినవయితే, మరి కొన్ని నేరాలు కొంతమంది మగవారి సరదాలు తీర్చుకునే కారణంగా జరిగినవి.

ఈమధ్య ఒకే రకమైన కొన్ని విచిత్రమైన నేరాలు జరిగాయి.

ఇంకా వయసు రాని ఆడపిల్లలతో కామకలాపాలు చేయటం లేదా కామకలాపాలకు రమ్మని ఆహ్వానించటం అమెరికాలో పెద్ద నేరం. ఇటువంటివారిని పట్టుకోటానికి పోలీసులు వేయికళ్ళతో ఎదురుచూడటమే కాక అలాటి వారిని వ్యూహాలు పన్ని మరీ పట్టుకుంటారు. ఇంటర్నెట్లో ఒక పదమూడేళ్ళ అమ్మాయిని చాటింగ్‌తో మొదలుపెట్టి, ఆంతర్యం కనుక్కొని ఎక్కడో హోటల్‌కి రమ్మని ఆహ్వానించాడొక తను. అంత దూరం డ్రైవ్ చేసుకుంటూ వెళ్ళి, ఆశతో కారు దిగగానే పోలీసులు అతన్ని పట్టుకున్నారు. అప్పుడు కానీ అతనికి అర్థంకాలేదు అది పోలీసులు తనలాటి వారిని పట్టుకోవటానికి వేసిన వల అని. అయిదేళ్ళు కాబోలు జైల్లో శిక్ష వేశారు. ఇక్కడ గమ్మత్తేమిటంటే ఇలా పోలీసుల వలలో చిక్కిన దాదాపు వందమందిలో 24 మంది భారతీయులు వున్నారు. వాళ్ళల్లో కొంతమంది, కొంతమందేం చాలమందే - మన హైదరాబాదీయులు. వాళ్ళల్లో కొందరు పెళ్ళయి కాపురాలు చేసుకుంటున్న వాళ్ళూ వున్నారు. ఇప్పుడు వాళ్ళందరూ జైళ్ళల్లో వున్నారు. చక్కటి హైటెక్ ఉద్యోగాలు పోయాయి. కుటుంబాలు కూలిపోయాయి. వాళ్ళు అమెరికన్ పౌరులు కానందున, శిక్ష పూర్తవగానే జైల్‌నించీ సరాసరి ఇండియన్ ఎంబెసీలో అప్పచెబుతారు. అలా ఇండియాకి బలవంతంగా పంపించబడటమేకాక, నేర చరిత్ర వుండటం వల్ల మళ్ళీ అమెరికాకీ, కొన్ని అమెరికా మిత్రదేశాలకీ వెళ్ళే అవకాశం లేదు.

అలాగే కొంతమంది కట్నాల కేసుల్లో ఇరుక్కుంటే, కొంతమంది కట్నాలు

చాలలేదనో ఇంకా కావాలనో భార్యలని శారీరకంగా మానసికంగా హింసించటం వల్ల జైలు పాలవుతున్నారు. హింసించబడ్డప్పుడు పోలీసులకి ఒక్క ఫోన్ కాల్ చేస్తే చాలు. అలాగే లాయర్లు. ఇలాటి కేసులు దొరికితే వాళ్ళకి బంగారు పంట. వదలరు.

నేనా మధ్య ఎన్నారై కబుర్లలో 'పుట్టింటి భార్యలు' వ్రాసిన తర్వాత, అమెరికాలోని వివిధ నగరాలనించీ నాకు కనీసం మూడు నాలుగు ఫోన్ కాల్స్ వచ్చాయి. దాదాపు అన్నీ ఒకే రకమైనవి. ఎంతో కష్టం తీసుకుని ఇండియాలో పెళ్ళి చేసుకుని, అక్కడే భార్యని వదిలి - ఏళ్ళు గడిచినా వాళ్ళని తీసుకువచ్చే ప్రయత్నం చేయకపోగా, ఇంకా డబ్బుల కోసమో విడాకులకోసమో వాళ్ళని వేధించటం, కొంతమందైతే వాళ్ళకి ఇక్కడే మరో పెళ్ళి. పెళ్ళాం. కాపురం. బాపు - రమణగార్ల ముత్యాలముగ్గు సినిమాలో నిత్య పెళ్ళికొడుకుల్లాటివారు వీళ్ళు. అలాటి కొంతమంది పుట్టింటి భార్యలు తమ తండ్రులతోనూ, కొంతమంది మిత్రుల సహాయంతోనూ వెతుక్కుంటూ అమెరికాకి వచ్చారు.

నాకు ఫోన్ చేసినవారిని నేనడిగింది ఒకే ప్రశ్న. 'మీరీ పెళ్ళిని కాపాడుకోవాలనుకుంటున్నారా, తెంచుకోవాలనుకుంటున్నారా' అని. కావాలనుకుంటున్న వాళ్ళకి, నాకు తెలిసిన సమాచారం ఏదో చెప్పాను కానీ, ఎంతవరకూ వాళ్ళది సాధించ గలిగారో చెప్పటం కష్టమే. 'తెంచుకోవటమే కాదు, అతను మా దగ్గర దోచుకున్నది కూడా సాధిస్తాం. జైల్లో పెట్టిస్తాం' అన్నవాళ్ళకి, ఈ దేశంలో లాయర్లు ఎలా సాధించగలరో, వాళ్ళతో మాట్లాడటమెలాగో నాకు తెలిసినంత వరకూ చెప్పాను. ఏది ఏమైనా అవి వారి జీవితాలు. వారి నిర్ణయాలు. ఇక్కడ చెబుతున్నది అది ఎంత నేరమో, అలాటి నేరాలకి లాయర్లూ, కోర్టులూ నేరస్థులని ఎలా వదిలిపెట్టరో, ఎలా శిక్షిస్తారో చూపిద్దామని.

బాగా కనిపిస్తున్న ఇంకో నేరం వీసా మోసాలు. ఇలాటివి కొన్ని ఇంతకు ముందు వివరంగా చెప్పుకున్నాం. ఇక్కడికి ఎలాగోలా వీసా సంపాదించుకుని వచ్చి వీసా పరిమితి అయిపోయి వెనక్కి తిరిగి వెళ్ళవలసి వున్నా వెళ్ళనివాళ్ళు, ఏ టూరిస్ట్ వీసా మీదో వచ్చి ఉద్యోగ ప్రయత్నాలు చేద్దామనుకునేవాళ్ళు కనిపిస్తారు. వాళ్ళ కోసం ఎప్పుడూ వెదుకుతూనే వుంటారు ఇమ్మిగ్రేషన్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు. 911 తర్వాత హోం సెక్యూరిటీ చట్టాలతో, ఇలాటివాళ్ళు ఎక్కడ వున్నా వదలటం లేదు. కొంత మందికి వెంటనే డిపోర్టేషన్, కొంతమందికి ముందు జైలు ఆ వెంటనే డిపోర్టేషన్. కొంతమంది అమాయకులకి వీసా ఇప్పిస్తామని, లక్షల్లో డబ్బు గుంజి అమెరికాకి తీసుకువచ్చి మళ్ళీ వాళ్ళ ముఖం చూడని పెద్ద మనుష్యులూ కొంతమంది జైళ్ళల్లోనూ, ఇంకా బయటపడని కారణంగా కొంతమంది బయట వున్నారు.

ఇలాటివి పేపర్లలోనూ, టీవీలలోనూ రావటంవల్ల, మనవాళ్ళకి వున్న మంచి పేరు కించిత్తు తగ్గుతున్నదేమోననిపిస్తున్నది. అంతే కాదు. ఎందుకు మనవాళ్ళిలా చేస్తున్నారని బాధ వేస్తుంది. ఇంతకుముందు ఏనాడూ కననివి విననివి ఇప్పుడెందుకు జరుగుతున్నాయి అనే ఆలోచనకూడా వచ్చింది. ఆలోచిస్తున్న కొద్దీ కొన్ని కారణాలు కనపడటం మొదలు పెట్టాయి. అవి ఎంతవరకూ నిజమో కానీ, నా ఆలోచనలకి

అందినవీ, ఈమధ్య కొందరు మిత్రులని కలిసినప్పుడు మా సంభాషణలలో దొర్లిన విషయాలూ కలిపి వ్రాస్తున్నాను.

ఒకటి: ఇంతకు ముందే చెప్పినట్టు ఈమధ్య చాల ఎక్కువ మంది అమెరికాకి వస్తున్నారు. మంది ఎక్కువయితే మజ్జిగ పలుచనవకపోతే ఆ సామెత చిన్నబుచ్చుకుంటుంది. మనుష్యులు ఎక్కువయినప్పుడు ఇలాటివి ఎక్కువవటంలో ఆశ్చర్యం లేదు.

రెండు: ఆ రోజుల్లో వచ్చినవాళ్ళు ఎక్కువమంది చదువుకోటానికి వచ్చిన వాళ్ళు. వచ్చే కాస్తోకూస్తో స్కాలర్షిప్పులూ టెక్నికల్ అస్సిస్టెన్స్షిప్పులతో రోజులు గడవటమే కష్టం. ఇక రాగభోగాలకి సమయమూ వుండేది కాదు, ఇంధనమూ వుండేది కాదు.

మూడు: ఈరోజుల్లో ఇక్కడికి వచ్చేవారిలో కొంతమందికి అమెరికాలో జరిగే చాల విషయాల మీద అవగాహన కాకుండా అపోహలు వుండటం. ఇలాటి సెక్స్ కేసుల గురించి మాట్లాడుతున్నప్పుడు, కొత్తగా అమెరికాకి వచ్చిన కుర్రాడు 'అమెరికాలో సెక్స్ ఫ్రీ కదా. అలాగే అనుకుని వుంటారు వీళ్ళు' అని జైల్లో కూర్చున్న 'అమాయకుల' గురించి అన్నాడు. అమెరికాలో సెక్స్ ఇండియాలో లాగా భార్యాభర్తల మధ్యా, ప్రేమికుల మధ్యా ఫ్రీనే. మిగతా చోట్ల కాదు. దాని కోసం డబ్బులు ఇస్తే వ్యభిచారం పేరుతో ఇచ్చినవాళ్ళనీ తీసుకున్నవాళ్ళనీ ఇద్దర్నీ వేరు వేరు జైళ్ళలో వేస్తారు.

నాలుగు: ఇందాక చెప్పిన కుర్రాడి పక్కనే కూర్చున్న ఇంకో కుర్రాడు 'పోలీసులలా ట్రాప్ చేయటం అమానుషం. అన్యాయం. ఇదే ఇండియాలో అయితేనా..' అని అక్కడ ఎన్నిరకాలుగా తప్పించుకోవచ్చో సవివరంగా చెబుతున్నాడు. అవన్నీ ఈ వ్యాసానికి అనవసరం.

అది సరేనయ్యా! మరి అమెరికాలో నేరాలు లేవా? ఇందాకటినించీ డబ్బాలు కొడుతున్నావు!

ఉన్నాయండీ, వున్నాయి. బాగానే వున్నాయి. కాకపోతే అమెరికాలో లా ఒక్కింతే కాదు, ఎంతో ఎక్కువగానే వుంది. క్రిమినల్స్ వెంటనే పట్టుబడిపోవటం చూస్తూనేవుంటాం. మనకి ఇండియాలో సినిమాల ప్రభావమో రాజకీయ నాయకుల గూండాయిజం ప్రభావమో, లంచాల, దురాచారాల ప్రభావమో... నాకు తెలీదు. ఈమధ్య లా ఒక్కింతయు లేదనీ, సమాజంలో అవినీతి, అభద్రత, వయొలెన్స్ పెరిగిపోయాయనీ ఇంటర్నెట్లో ఇండియన్ పేపర్లలోనే చదువుతున్నాం. అలాటి వాటి ప్రభావం వున్న వాళ్ళు, అమెరికాలోని లా అండ్ ఆర్డర్ని తక్కువగా అంచనా వేసి పట్టుబడుతున్నారా? ఏమో నాకు తెలీదు. నాకు తెలిసిందల్లా ఒక్కటే - అమెరికా ప్రజలలో, సమాజంలో క్రమశిక్షణ ఎక్కువ. లా కూడా ఒక్కింతే కాదు, పదింతలో ఇంకా ఎక్కువో ఎక్కువ. అందుకే మనవాళ్ళు ఎంతోమంది ఎంతో మంచివాళ్ళే అయినా, పైన చెప్పిన వారిలాటి కొద్దిమందీ జాగ్రత్తగా వుండటం వాళ్ళకే కాక, ఇక్కడ వుండే మన కమ్యూనిటీకీ అవసరమే!